# పద్మావతీ చరణ చారణ చక్రవర్తి

''ఊఁ, చెప్పునాయనా! నీ సమస్య ఏమిటో సవిస్తరంగా చెప్పు'' అన్నాడు సైక్రియాట్రిస్ట్ శిశిర చంద్రసేన్, తన కన్సల్టింగ్ రూంలోకి వచ్చి కూర్చున్న శ్రీనివాస చక్రవర్తితో. రాత్రి పదిగంటలయింది. అదే చివరి అప్పాయింట్‌మెంట్. డాక్టర్ శిశిర చంద్రసేన్ బెంగాలీ వాడయినా, ఎన్నో తరాలుగా హైదరాబాదులో వుండడంవల్ల చక్కటి తెలుగు మాట్లాడుతాడు. సైక్రియాట్రిస్ట్‌గా ఆయనకెంతో పేరు ప్రఖ్యాతులున్నాయి. వయసు డెబ్బయిపైబడి వుంటుంది. జుట్టు తెల్లబడిపోయింది. ముఖంలో ఎంతో తేజస్సు, ఎదుటి వ్యక్తిపట్ల సానుభూతి వ్యక్తమవుతూ వుంటుంది ఆయన కళ్ళల్లో.

శ్రీనివాస చక్రవర్తికెలా మొదలుపెట్టాలో తోచలేదు. నర్వస్‌గా ఫీలయాడు. ఆ ఎయిర్ కండిషన్డ్ రూంలోనూ చెమటలు పట్టాయి అతనికి. ''ఐ ఫీల్ అయాం ఇంపొటెంట్ డాక్టర్!'' అన్నాడు, ఎలా మొదలుపెట్టాలో, చెప్పాలో అర్థంకాక.

''సమస్య సంగతి తర్వాత. ముందు నీ పేరు, వృత్తి, భార్య, పిల్లలు, గృహస్థ జీవనం వీటి సంగతి చెప్పు. సంకోచించాల్సిన పనేం లేదు. నన్ను నీ స్నేహితుడిగా భావించుకో. ఐయాం హియర్ టు హెల్ప్ యు, అండ్ షేర్ యువర్ ఆంగ్జైటీ'' అని తెల్లగా నవ్వాడు డాక్టర్ శిశిర చంద్రసేన్.

ఆ మాటల్తో కొంత ఆశ్వాసన లభించినట్లయింది చక్రవర్తికి. చెప్పసాగాడతను. ''నాపేరు శ్రీనివాస చక్రవర్తి. 'పద్మావతీ ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్ అప్లయెన్సెస్ కంపెనీ'కి మేనేజింగ్ డైరెక్టర్ని. నా భార్య పేరు పద్మావతి. ఆమె పేరునే ఈ ఇండస్ట్రీ స్టార్ట్ చేసి పదిహేను సంవత్సరాలయింది. చాలా తక్కువ పెట్టుబడితో ప్రారంభించాను. ఎన్నో ఒడిదుడుకులకు గురయాను. ఇప్పటికి కొంత నిలదొక్కుకోగలిగాను. ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ అప్లయెన్సెస్ ఇండస్ట్రీలో నా ప్రొడక్టులకు మంచి పేరుంది. స్వయంకృషితో నిర్మించుకున్న చిన్న సామ్రాజ్యం నాది. బిజినెస్‌లో నాకిప్పుడేం ప్రాబ్లమ్స్ లేవు.''

''కంపెనీకి నీ భార్య పేరు ఎందుకు పెట్టావు?'' అడిగాడు డాక్టరు మధ్యలో అతని కథనానికి అడ్డొస్తూ.

''నేను బి.ఇ (ఎలక్ట్రికల్)లో గోల్డ్ మెడలిస్ట్‌ని. నా పెళ్ళయినప్పటికే నేనో ప్రయివేట్ ఫరంలో ఇంజనీరుగా పనిచేస్తూండేవాడిని. ఆ ఉద్యోగం నాకంత సంతృప్తిని కలిగించలేదు. నా శక్తినీ

సామర్థ్యాన్నంతా ఆ ఉద్యోగం చేస్తూ వృధా చేస్తున్నాననిపించింది. నా భార్య ఈ విషయం గ్రహించింది. 'మీరే ఓ ఇండస్ట్రీ ఎందుకు స్టార్ట్ చేయరు?' అని అడిగింది ఓ రోజు. నేను చెప్పాను.'పెట్టుబడి సమస్య. పెట్టబోయే కంపెనీ ఎలా నడుస్తుందో, సంసారం జరుగుబాటయినా కావాలిగదా!' అని. ఆమె అప్పటికే ఎం.ఏ. ఇంగ్లీషు లిటరేచర్‌తో పాసయి ఉంది. ఉద్యోగ ప్రయత్నం చేసింది. ఆ రోజుల్లో ఇప్పుడున్నంత అనెంప్లాయిమెంట్ ప్రాబ్లం లేదు. తేలిగ్గానే ఓ సిటీ కాలేజీలో ఉద్యోగం దొరికిందామెకు. ఉద్యోగం వచ్చిన సాయంత్రమే నాతో అంది. 'ఇంటి సంగతి నాకొదిలేయండి. ఇంటి ఖర్చుకు మీరు పైసకూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇంటికి సంబంధించిన పనులన్నీ నేను చూసుకుంటాను. ఇక పెట్టుబడి. మా వాళ్ళు నాకిచ్చిన ఐదెకరాల పొలం అమ్మేయండి. బాంకులో లోను తీసుకోండి. మాడెస్ట్‌గా ఇండస్ట్రీ స్టార్ట్ చేయొచ్చనుకుంటాను' అని. ఆ పనే చేశాను. ఆ రోజుల్లోనే ఆమె భూమికి లక్ష రూపాయలు వచ్చాయి. బాంకు లోన్లు తీసుకున్నాను. మొదట్లో తెలీక పొరపాట్లు చేయటం, నష్టం రావటం, మళ్ళీ పుంజుకునే ప్రయత్నం చేయటం - ఇలా సాగింది వ్యాపారం. ఆమె అనేది, 'పని చేసే వాళ్ళని దోచుకుని మాత్రం డబ్బు సంపాదించాలని ప్రయత్నం చేయకండి. స్క్వీజ్ దెం అట్‌మోస్ట్, బట్ పే దెం హాండ్‌సంలీ. మంచి కాపిటలిస్టులందరూ నేర్చుకోవాల్సిన మొట్టమొదటి ఎకనామిక్ ప్రిన్సిపుల్ అది' అని. అలానే చేశాను. మా కంపెనీలో పనిచేసే వాళ్ళలో ఎవరిలోనూ డిస్‌కంటెంట్‌మెంట్ లేదు...''

తన చేతులతో తన జీవితానికి బాట వేసుకున్న ప్రతి వ్యక్తిలోనూ కించిత్ గర్వం, అహం వ్యక్తమవుతూనే ఉంటాయి. అది సహజం.తను స్వయంగా నిర్మించుకున్న ప్రపంచాన్ని గూర్చి మాట్లాడడం అతనికిష్టం. ఆ ప్రసక్తి వచ్చేసరికి చక్రవర్తిలో అదివరకున్న నర్వస్‌నెస్ మటుమాయమయి, స్వేచ్ఛగా మాట్లాడసాగాడు.

''నేను కాపిటలిస్టును. నా భార్య సోషలిస్ట్. కంపెనీ వల్ల వచ్చే లాభాన్ని మా సొంతానికి వాడటానికి ఆమె అంగీకరించేది కాదు. 'మీరూ కంపెనీ వర్కరే - పెద్ద వర్కరు. మీ పనికి తగిన జీతం తీసుకోండి. మిగిలింది పరిశ్రమ అభివృద్ధికే వినియోగించండి. మరికొంతమందికి ఉపాధి కల్పించండి. అధిక లాభాల కోసం, అధిక ధరలతో వినియోగదారుల్ని బాధించకండి.' అనేది నా భార్య పద్మావతి. ఆమె ఆదర్శాలన్నీ ఆచరణలో పెట్టడం కష్టం. మా వస్తువుల్ని తక్కువ ధరకు అమ్మితే ఇండస్ట్రీలో ఎన్నో సమస్యలొస్తాయి. వినియోగదారులు మా ప్రాడక్ట్స్ ఇన్‌ఫీరియర్ క్వాలిటీవనుకుంటారు. ఆ పైన అడ్వర్‌టైజ్‌మెంటు ఖర్చులు అధికమయిపోయాయి. అందువల్ల వీలైనంతమేరకు, ఆమె సలహా పాటించాను. ఆమె తన మాట నిలబెట్టుకున్నది. ఇంటి పనేదీ నాకు చెప్పలేదు, ఇంటి ఖర్చుకోసం ఇవాల్టివరకు పైసా నన్నడగలేదు. మా ఇల్లు ఇవాల్టికీ చాలా సాదా సీదాగా ఉంటుంది. నాలాంటి రిచ్ ఇండస్ట్రియలిస్టు ఇల్లులాగా ఉండదు. పదేళ్ళ క్రితం ఓ

చిన్న ఇల్లు కొన్నాను. అదొక్కటే నేను మా సంసారం కోసం చేసిన ఖర్చు. విలాసవంతమైన జీవితం గడపటం నా భార్యకిష్టం లేదు. నాకు కారుంది. కానీ, ఆమె నా కారు ఉపయోగించదు. రోజూ బస్సులో కాలేజీకి పోయి వస్తూవుంటుంది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే నా భార్య ఆదర్శపత్ని, గృహిణి అని చెప్పటానికి. ఆమె సలహా, సహకారం, ప్రోత్సాహం లేకపోతే, నేను నేను కాదు. జీవితంలో ధనార్జనే ముఖ్యం కాదు అని ఆమె నాకు నేర్పింది. తాను సుఖపడి ఇతరుల్ని సుఖపెట్టడం ఆమె నేర్పింది. నాకు జీవితంలో తృప్తి ఉంది. ఓ లక్ష్యం ఉంది. దాన్ని సాధించాను. ఇంకా ప్రయత్నిస్తున్నాను... మరి నా కంపెనీకి నా భార్య పేరు కాక ఇంకేం పేరు పెట్టను డాక్టర్!...''

''మీకెంతమంది పిల్లలు?'' అడిగాడు డాక్టరు.

''ఇద్దరు. పెద్దమ్మాయి పదో క్లాసు చదువుతోంది. తరవాతి వాడు ఎనిమిదో క్లాసు. నా భార్యే వాళ్ళ సంగతి చూసుకుంటుంది. ఎలాంటి సమస్యల్లేని నన్ను, ఓ సంవత్సరం నుండి ఓ సమస్య పీడిస్తోంది డాక్టర్! అది నామీద నాకే నమ్మకం లేకుండా చేస్తున్నది...'' అని ఆగిపోయాడు చక్రవర్తి.

''చెప్పు చక్రవర్తీ! సిగ్గు పడాల్సింది ఏమీ లేదు. ఈ ప్రపంచంలో మనిషి బలహీనుడు. బలహీనతలకు లొంగిపోవటం సహజం. నువ్వు నా దగ్గరకు వచ్చావంటే ఆ బలహీనతల బురదనుండి బయటపడాలని ప్రయత్నం చేస్తున్నావన్నమాట. ఇది మంచి లక్షణం. చెప్పు. సంకోచించకు.'' అన్నాడు డాక్టర్ శిశిరచంద్రసేన్ ధవళజ్యోత్స్నలా నవ్వుతూ.

''సంవత్సరం క్రితం ఓ పెద్ద కాంట్రాక్టు మాట్లాడుకోవటానికి బెంగుళూరు వెళ్ళాను డాక్టర్. తీరా వెళ్ళిన తర్వాత గానీ కావలసిన పేపర్లన్నీ తీసుకురాలేదని చూసుకోలేదు. వెంటనే అక్కడినుండి మా ఆఫీసుకు ఫోను చేశాను. నా పర్సనల్ సెక్రటరీ నీహారిక ఫోనెత్తింది. కావల్సిన పేపర్ల లిస్ట్ చెప్పి, మా ఆఫీసు సూపరింటెండెంట్‌కిచ్చి వాటిని వెంటనే పంపమని చెప్పాను. 'వట్టి కాయితాలు తీసుకురావటమేనా, లేక బెంగళూరులో ఇంకా ఆయన చెయ్యాల్సిన పనేమయినా ఉందా సార్?' అని అడిగింది నీహారిక.

'ఏం లేదు. కాయితాలు తీసుకురావటమే' అన్నాను నేను ఫోనులో.

'అయితే ఓ చిన్న రిక్వెస్ట్ సర్! ఆ కాయితాలు నేను పట్టుకొస్తాను. బెంగుళూరు బావుంటుందిట కదా! చూసినట్టవుతుంది.' అంది ఆమె.

'సరే, నువ్వే తీసుకురా..' అని ఫోను పెట్టేశాను.

''అదే నేను అనాలోచితంగా చేసిన చిన్న పొరపాటు. నీహారిక మర్నాడు బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌లో వచ్చింది. స్టేషనుకు వెళ్ళి ఆమెను రిసీవ్ చేసుకున్నాను. నా హోటల్లోనే వేరే గది

తీసుకుంది ఆమె. కాయితాలు నాకు ఇచ్చి, ఆమె బెంగుళూరు సైట్ సీయింగ్‌కు పోయింది. ఆరోజు మర్నాడు మధ్యాహ్నం దాకా నాకు బిజినెస్ పనిమీదే సరిపోయింది. పనయింతర్వాత 'ఇహ సామాన్లు సర్దెయ్యి. హైదరాబాదు వెళ్ళి పోదాం' అన్నాను నీహారికతో.

'మీరు మైసూరు ఎప్పుడన్నా వెళ్ళారా సార్!' అనడిగింది ఆమె.

'లేదు, పడలేదు' అన్నాను.

'బృందావన్ గార్డెన్స్ చాలా బావుంటాయట, వెళ్దామా సార్?' అంది ఆమె.

'బావుంది. మనం వచ్చింది ఆఫీసు పనిమీదా, సైట్ సీయింగ్‌కా?'

'ఒక్కరోజులో ఏం పోతుంది? ఒక్కరోజు. ఒక్కరోజంటే ఒక్కరోజు. రాలేరా మీరు...'

'నీకు వెళ్ళాలని వుంటే నువ్వు వెళ్ళు. నేను రాను'

'పోన్లెండి. ఒక్కత్తినే ఎలా వెళ్తాను. నేనూ మీతో పాటే హైదరాబాదు వస్తానులెండి' అంది ఆమె నిరుత్సాహంగా.

''ఆమె నిరుత్సాహం చూసి నేను కరిగిపోయాను. నాకూ కంపెనీ వ్యవహారాల్లో అసలు తీరిక వుండడం లేదు. ఓ రోజు కులాసాగా గడిపితే ఏం పోయిందీ అనిపించింది. పైగా బెంగుళూరు కాంట్రాక్ట్ కుదిరిపోవటంతో నేను ఉల్లాసంగా వున్నాను. అందుకే 'సరే పద, వెళ్దాం' అన్నాను.

''ఆమె ఉత్సాహంగా బయలుదేరింది. నీహారిక కంపెనీ మానేజింగ్ డైరెక్టర్ని - నన్ను అంత చనువుగా అడిగిందంటే దానికి నా ప్రవర్తనే కారణం. నేను కంపెనీలో ఎవరితోనూ రిజర్వ్‌డ్‌గా వుండను. అందరితోనూ ఆత్మీయంగా మాట్లాడతాను. పనుంటే నా అంతట నేనే వెళ్ళి మామూలు వర్కర్‌తో కూడా మాట్లాడటానికి సంకోచించను. అలాగని వాళ్ళు నన్ను నిర్లక్ష్యం చేయకుండానూ చూసుకుంటాను.

''మేం మైసూరు వెళ్ళేటప్పటికి సాయంత్రం ఐదు గంటలయింది. హోటల్లో రెండు గదులు తీసుకున్నాం. స్నానం చేసి, రిఫ్రెష్ అయి టాక్సీలో బృందావన్ గార్డెన్‌కి వెళ్ళాం. కావేరీ నదిపై కృష్ణరాజసాగర్ డాంకి పక్కన నిర్మించిన ఉద్యానవనమది. అదో సజీవ కళాఖండం. దీపాల వెల్తురులో ఆ ఫౌంటెన్స్ అద్భుతం. ఎంతో హాయి అన్పించింది. అక్కడ నుండి రావాలని అన్పించలేదు నాకూ, ఆమెకూ. ఓ చోట కూర్చున్నాం. ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకుంటూ.

'థ్యాంక్యూ మిస్టర్ చక్రవర్తీ! చక్కటి ప్రదేశానికి తీసుకొచ్చారు. నాకెంతో ఆనందంగా ఉంది' అంది ఆమె, అని 'సర్ అనకుండా మిస్టర్ చక్రవర్తీ అన్నాను పొరపాటున సారీ' అంది.

'ఓ డోన్ట్.. డోన్ట్ సే ఇట్. నిజంగా నువ్వలా పిలవటమే నాకిష్టం.' అన్నాను నేను.

'ఎందుకో?' అంది ఆమె అలవోకగా నావంక చూస్తూ.

'ఎందుకేమిటి? 'మిస్టర్' కూడా గౌరవవాచకమేగా, 'సర్' అన్నమాట 'కలోనియల్' వాసన కొడ్తుంది. 'సర్' కంటే 'మిస్టరే' బావుంటుంది నాకు'

'అంతేనన్నమాట...'

'అంతకంటే ఇంకేముంటుంది?'

'మనం ఆఫీసు దాటినా మీరు బాస్, నేను సబార్డినేట్ అన్న విషయం మర్చిపోమెందుకనీ?'

'మర్చిపోవాలి. మనం ఇక్కడ స్నేహితులం. నేను బాసూ కాదు. నువ్వు సెక్రెటరీవీ కాదు. అంతే'

'మీరు మగా. నే ఆడా - అది మాత్రం మర్చిపోకూడదు' అంది కిలకిలా నవ్వుతూ నీహారిక.

''అప్పుడు మొదటిసారిగా నేను ఆమెవంక చూశాను. ఆమె కొత్త వ్యక్తేం కాదు. కానీ ఆ రోజు ఆమెలో సెక్రటరీ కాదు, స్త్రీ కన్పించింది. పని వత్తిడిలో చాలా విషయాలు పరిశీలించని నా అనాసక్తతను ఆమె నవ్వు ఛేదించినట్లనిపించింది. దానికి ఆ వాతావరణం దోహదం చేసిందేమో. స్త్రీగా ఆమెని మొట్టమొదటిసారిగా చూశాను. ఆమె అందమైనదే. హృదయాకారపు ముఖం ఆమెది. విశాలమైన నుదురు, నిండైన బుగ్గలు. సిగ్గుపడినప్పుడు వాటిల్లో కెంపులు. గడ్డం గుండ్రంగానూ, మొనతేలినట్టూ కాక మధ్యస్థంగా వుంటుంది. సన్నటి కనుబొమలు. నవ్వుతుండే కళ్ళు. పొడవైన నాసిక, మరీ చిన్నదికాని నోరు, నవ్వితే కాంతులీనే తెల్లటి పలువరుస. ఐదడుగదుల నాలుగంగుళాల ఎత్తూ, పచ్చటి ఛాయ, కుదురైన శరీరం, వయసు పాతికేళ్ళు వుంటాయేమో. మొత్తం మీద ఆమెది మనస్సునాకట్టుకునే రూపమే.

'అవును. ఆ సంగతి మాత్రం మర్చిపోకూడదు. లేకపోతే ప్రమాదం' అన్నాను నేను ఆమె నవ్వుతో శృతికలిపి.

'ఏవిటో ఆ ప్రమాదం..' అడిగిందామె మునిపంట పెదవి కొరుకుతూ.

'అరిటాకూ - ముల్లు సామెత. ఆడదానికి నీకు తెలీదా?' అన్నాను.

'నేనిప్పటిదాకా మీరు అరిటాకే అనుకుంటూ వచ్చాను. ముల్లన్న విషయం ఇప్పుడు మీరు చెప్తేనే తెలిసింది...'

'మగాళ్ళని పనిగట్టుకుని అవమానించకూడదు స్త్రీలు'

'పోన్లెండి.. ఇన్నేళ్ళకి నేను ఆడదానిలా కనబడ్తున్నాను మీ కంటికి'

''ఆ వాతావరణం, పక్కన ఆడది ఉన్న స్పృహ నన్ను మరిపించింది, బుద్ధి కోల్పోయేటట్టు చేసింది. లేచి ఫౌంటెన్ల చుట్టూ తిరిగాం. బోటు షికారు చేశాం. ఆమె నన్ను రాసుకుంటూ,

రాసుకుంటూనే తిరిగింది. మెట్లు దిగుతూ పడబోతుంటే చెయ్యి పట్టుకుని ఆపాను. ఆ తరువాత ఆ చెయ్యి నేను వదల్నూ లేదు. ఆమె విడిపించుకోనూ లేదు.

''హోటల్‌కి వచ్చి భోజనం చేసి మా గదులకెళ్ళబోతూ..

'నిద్రొస్తుందా, పడుకుంటారా..?' అంది నీహారిక.

'నా గదిలోకి రా, కబుర్లు చెప్పుకుందాం' అన్నాను నేను.

''ఆమె నా గదిలోకి వచ్చి సోఫాలో కూర్చుంది. నేను గుడ్డలు మార్చుకుని పక్కమీద నడుం వాల్చాను.

'ఇవాళ చాలా హాయిగా ఉంది..' అంది ఆమె.

'అవును. రొటీన్ నుండి బయటపడటం అవసరం. ఆఫీసు డ్రస్సు విప్పేసి, నైట్ డ్రస్ వేసుకున్నంత తేలిగ్గా, హాయిగా ఉంటుంది రొటీన్నుండి బయటపడడం...'

'పొల్లెండి. నైట్ డ్రస్‌తో ఆపారు. అదీ లేకపోతే ఇంకా హాయిగా ఉంటుందనలేదు'

'నిజమే. నీకు మాత్రం అలా అన్పించదా?'

'అవును. నైటీ వేసుకుంటే హాయిగాను వుంటుంది. వేసుకొచ్చేదా?'

'అసలేం వేసుకోకపోతేనేం'

'పొండి. మీరు మరీ...'

''ఆడది పొమ్మంటే రమ్మనే అర్థం. చెయ్యి పట్టుకుని లాగాను. వచ్చి నా గుండెలమీద పడింది.

'ఏమోననుకున్నాను.. మీరూ మల్లే..' అంది నీహారిక నా జుట్టులో వేళ్ళు దూరుస్తూ, ఆడుకుంటూ.

''నేనామెని గాఢంగా కౌగిలించుకున్నాను. 'అబ్బ! ఆగండి. మీ కంతా తొందర...' అని లేచి, ఆమె వివస్త్ర అయింది. ఆ ట్యూబ్‌లైట్ వెలుగులో ఆమె పాలరాతి బొమ్మలా వుంది. బలంగా దిటవుగా వున్న వక్షోజాలూ, చదునైన క్రింది మైదానం, తొడలూ నన్ను పిచ్చివాణ్ణి చేశాయి. ఆమెని చూసి నాకు పిచ్చెక్కినట్లయింది. తాళలేక నేను ఆమెను నా వైపునకు లాగాను. శరీరాలు పెనవేసుకున్నాయి. మనసు మేరువులా ఉత్తుంగ శృంగమైంది. కొండ కొమ్ము మీదనుండి లోయలోకి తొంగి చూసేవాడికి, కిందకు దూకుదామన్న బలమైన ఇచ్ఛ కలుగుతుంది. ఆ లోతుల్లోకి తన్ను తాను లయించుకోవాలన్న ఆర్తి. నేనా ప్రయత్నంలోనే ఉన్నాను...'' ఆగిపోయాడు చక్రవర్తి.

''ఏమయింది? ప్రొసీడ్..'' అన్నాడు డాక్టర్ శిశిరచంద్రసేన్.

''టేబిల్ మీద నా లెటర్ పాడ్ పడివుంది. ఫానుగాలికి ఆ కాయితాలు ఎగురుతున్నాయి. ఆ

తన్మయతలో వున్న నా దృష్టి ఎందుకటుపడిందో ఏమో - ఆ లెటర్ పాడ్ మీది అక్షరాలు - 'పద్మావతీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ అప్లయెన్సెస్' మీద పడింది. అంతే. నేను నీరు కారిపోయాను. నీహారిక నావంక 'ఉస్సు'రంటూ చూసింది. ఆమె పైకేం అనలేదు. 'ఇంతేనా? నువ్వు మగాడివేనా?' అన్నట్టున్నాయి ఆమె చూపులు. లేచి గుడ్డలు వేసుకుంది. కనీసం 'గుడ్‌నైట్' కూడా చెప్పకుండా తలుపుతీసుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

''మర్నాడు పొద్దున ఏమీ జరగనట్టే 'గుడ్‌మార్నింగ్ సర్!' అని విష్ చేసింది నీహారిక. ఇదివరకు అనుకున్నట్టు ఆ రోజు కూడా అక్కడే ఉండాలి. కాని మా ఇద్దరిలో ఎవరికీ అక్కడింక వుండబుద్ధి కాలేదు. తిరిగి వచ్చేశాం. హోటల్ రూం ఖాళీచేసి బయటకొచ్చేటప్పుడు అంది ఆమె. 'మీరూ అరిటాకే. జాగ్రత్త చిరిగే ప్రమాదముంది' అని.

''నీహారిక నన్నంతటితో వదలలేదు. ఇదివరకటిలా ఆమె పనిమీద శ్రద్ధ చూపించడం లేదు. నేనేం అనలేకపోయేవాడిని. ఓసారి ఆమె అశ్రద్ధవల్లే సమయానికి టెండర్ పంపలేకపాయాం. కాంట్రాక్టు దొరికితే లక్షలమీద లాభమొచ్చేది. ఆ రోజు ఆమెమీద నాకు చాలా కోపమొచ్చింది. గట్టిగా వార్నింగ్ ఇద్దామనే బజ్జర్ నొక్కి ఆమెని పిల్చాను. ఆమె వచ్చి నా యెదురుగా కుర్చీలో కూర్చుంది. ఆమె మొహం వంక చూస్తూ నేనేం అనలేకపోయాను. అందుకనే టేబిల్‌వంక చూస్తూ 'ఇలాంటి పొరపాట్లు వస్తే, నిన్నింక డిస్మిస్ చేస్తాను. పనిలో అంత అశ్రద్ధ అయితే ఉద్యోగం మానటం మంచిది' అన్నాను. అంతకంటే గట్టిగా మాట్లాడలేకపోయాను.

'సారీ సర్..' అంది.

'సారీలు చెప్పినందువల్ల కంపెనీకొచ్చే నష్టం పూడదు'

'పోనీ ఇంకెలా చెప్పాలో చెప్పండి'

నేనేం మాట్లాడలేదు.

'ఇవాళ నా పుట్టినరోజు. మీరు సాయంత్రం మా ఇంటికి రావాలి. అక్కడ నా తప్పిదానికి పూర్తి క్షమాపణ చెప్పుకుంటాను'

'నాకివాళ కుదరదు'

'ఎందుకు కుదరదు. మీరు వస్తున్నారు. మరో మాట చెప్పకండి'

''అలా నా మాటల్లోని సీరియస్‌నెస్‌ను తగ్గించేసిందామె. ఆ రోజు సాయంత్రం ఆమె ఇంటికి వెళ్ళక తప్పలేదు. అసలు నేను నేను కాదు. ఆమె చెప్పినట్లు నడచుకోవాల్సిన మనిషినయ్యాను. ఆ రోజు కూడా ఆమె నన్నెంతో ప్రోత్సాహపరిచింది. 'ఒక్కసారికే అలా నీరుగారిపోతే ఎలా? లెట్స్ ట్రై వన్స్ అగైన్' అంది. నాకూ దాని అంతు చూడాలనే అన్పించింది. ఒకసారి ఆమెపై ఆధిపత్యం వహించ గలిగానా, ఆమెకు నేనింక మానసికంగా లోబడివుండాల్సిన పనిలేదు. ఆమెను జయించాలి.

కానీ ఆరోజు నేను ఆమెనేం చేయలేకపోయాను. నిలబడలేకపోయాను. ఇలా ఒకసారి కాదు. చాలా సార్లు. ఆమె నన్ను ఆహ్వానించడమూ మానలేదు. నేను ప్రయత్నించడమూ మానలేదు. ప్రతిసారీ నాలో ఆత్మన్యూనత కలిగేది. ఓడిపోయానన్న క్షోభ కలిగేది. ఆఫీసు పనిలో శ్రద్ధ వహించడం తగ్గిపోయింది. అందరూ గమనించకపోయినా నా భార్య గమనించింది. 'ఏమిటలా ఉన్నారు? ఏమయింది?' అనడిగింది. కాని నేను ఆమెకేం చెప్పలేకపోయాను.''

''మీ భార్యతో మీ సెక్స్ సంబంధాలెలా ఉన్నాయి'' అడిగాడు డాక్టర్ శిశిరచంద్రసేన్.

''డాక్టర్! నా నపుంసకత్వం నీహారిక దగ్గరే. నాభార్య దగ్గర అలాంటిదేం లేదు. ఆమె దగ్గర నేనెప్పుడూ ఇన్ఫీరియర్‌గా, అల్పుడిగా ఫీలవలేదు. షి ఈజ్ ఆల్సో హాపీ విత్మీ. కానీ నీహారికే నా జీవితంలో వీక్ స్పాట్ అయిపోయింది. ఆమె పనిచేయకపోయినా ఏమనే స్థితిలో లేను. అలా అని ఆమెను ఉద్యోగంలోనుండి తీసేయలేను. ఎప్పుడయినా గట్టిగా కోప్పడితే 'అరిటాకు...' అని నవ్వేది నావంకచూసి. నా అసమర్థత స్మరణకొచ్చి నేను మాన్పడిపోయేవాడిని.

''నాకు ఇదో మధనైపోయింది. నేనెప్పుడూ ఎక్స్‌ట్రా మారిటల్ ఎక్స్‌పీరియన్స్ కావాలని కోరుకున్న వాడిని కాదు. అనుకోకుండా వచ్చిపడింది. నీహారికను సాధించలేకపోయాను. మరో స్త్రీనయినా సాధించగలనా? ప్రయత్నించాను. ఎప్పుడూ లేని అలవాటు. బయటకు టూర్ వెళ్ళినప్పుడు వేశ్యల సాంగత్యం నెరపడానికి ప్రయత్నించాను. ఎక్కడకెళ్ళినా నేను ఫెయిల్యూరే. ఆ స్త్రీల అపహాస్యపు నవ్వు నా హృదయ చ్ఛేదమయ్యేది. కంపెనీలో పుకార్లు మొదలయ్యాయి. 'బాస్‌కి ఆడగాలి సోకింది' అని చెప్పుకోసాగారు. ఏ స్త్రీనయినా తార్చి నాచేత పనిచేయించుకోవాలి అన్న ప్రయత్నాలు జరిగాయి. నీహారికతో తిరగడంతో ఆమెకూ నాకూ సంబంధం వున్నదని చెప్పుకోసాగారు. ఇందువల్ల నేను సాధించింది చెడ్డపేరు తప్ప మరేం లేదు.

''నీహారికకు నేనిప్పుడు లోకువైపోయాను. జీతం పెంచమంది. పెంచాను. ప్రియురాలికి జీతం ఎక్కువ చేశానని పుకారు మొదలైంది. ఇప్పుడామె మానేజరల్ పోస్ట్‌కి తనని ప్రమోట్ చేయమంటోంది. స్టెనోలు, పర్సనల్ సెక్రటరీలకు మానేజరల్ పోస్ట్‌లు ప్రమోషన్‌మీద ఇవ్వడం సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. కాని ఆమె అంత బాధ్యతాయుతమైన పని నిర్వహించలేదు. ఆమెకా శక్తి లేదు. అర్హతలేని వాళ్ళని నేనెప్పుడూ దగ్గరకు రానివ్వలేదు. ఆమెకావిషయం చెప్పాను.

'మనిషికి సామర్థ్యం లేదని నేనెప్పుడూ గేలిచేయను. దిగితే కదా లోతు తెల్సేది. పదిసార్లు అపజయం పొందొచ్చు. కాని ఎప్పుడూ అపజయం పొందుతామా, పొరపాట్లు చేస్తామా? మీరు పోస్ట్ ఇస్తేకదా నా అర్హత తెల్సేది' అంది నవ్వుతూ. ఆమె నవ్వులో అపహాస్యం ధ్వనించింది నాకు. నా లేనితనాన్ని గేలిచేస్తున్నట్లనిపించింది. 'నేనెన్నిసార్లు నీకవకాశం ఇవ్వలేదు. నువ్వు నాకొక్కసారి ఇవ్వలేవా?' అన్నట్లున్నాయి ఆమె మాటలు.

''దిసీజ్ ప్రిసైజ్‌లీ మై స్టోరీ డాక్టర్ - మై స్టోరీ ఆఫ్ అగొనీ అండ్ ఇంపొటెంట్ రేజ్. మేక్ మి వైరైల్ వన్స్ - ఎట్ లీస్ట్ ఓన్లీ వన్స్. నా మొగవాడితనం ఆమెకొక్కసారి రుచిచూపించాలి. ఆమెను సాధించాలి. ఆ అపహాస్యాన్ని అణిచెయ్యాలి. అప్పుడామెను నేను టాకిల్ చెయ్యగలను డాక్టర్.. ప్లీజ్ హెల్ప్‌మి. షో మి ద వే'' అని నిర్వేదంగా ముగించాడు చక్రవర్తి తన కథనం. అతని కళ్ళంబట నీళ్ళు కారుతున్నయ్యి. జేబుగుడ్డతో కళ్ళు వత్తుకున్నాడు.

డాక్టర్ శిశిర చంద్రసేన్ నవ్వి అన్నాడు ''వై డోంట్ యు థాంక్ హర్? షి కుడెంట్ రేప్ యు. మిస్టర్ చక్రవర్తీ! ఒక్కవిషయం స్పష్టంగా తెల్సుకో. నువ్వు ముమ్మాటికీ నపుంసకుడివి కాదు. నీకు లైంగిక సామర్ధ్యం లేదనుకోవద్దు. నీ భార్యతోడి సంబంధమే అందుకుదాహరణ.''

''కానీ డాక్టర్! నీహారిక, మిగతా స్త్రీల దగ్గర నా ఫెయిల్యూర్‌ని ఎలా సమర్ధిస్తారు.''

''ఇట్స్ బికాజ్ ఆఫ్ యువరోన్ కాన్షన్స్. నీ భార్యమీద నీకు ప్రేమ వుంది. కృతజ్ఞత ఉంది. ఆమెపట్ల అవిశ్వసనీయంగా ప్రవర్తిసున్నానేమోనన్న నైతికగ్లాని, భయం ఉన్నాయి. అవే నీ సబ్‌కాన్షస్‌లో పనిచేస్తూ ఉంటాయి. ఒక క్రమంలో పెరిగినవాడివి. అక్రమంగా చరించడం నీవల్ల కాదు. నువ్వు కాన్షస్‌గా ప్రయత్నించినా సబ్‌కాన్షస్ మైండ్ నీకు సహకరించదు. నీ భార్యపై నీకున్న ప్రేమా, నీ నైతిక నిష్టా నీకు రామకవచంలాంటివి. నువ్వు కావాలన్నా చెడుమార్గాన నడవనివ్వవు అవి. స్త్రీల విషయంలోనే కాదు. మీ బిజినెస్ వ్యవహారంలో కూడా అక్రమంగా వ్యవహరించడం నీ వల్ల కాదు. ఆవేశంతో, ఉద్రేకంలో ఏ కొద్దిసేపో నిన్ను నువ్వు మర్చిపోయావు. లెటర్ పాడ్‌మీద నీ భార్య పేరు కన్పించగానే, నీలో నైతిక వ్యక్తి, భార్యాప్రణయైక జీవి నిద్ర మేల్కొన్నాడు. నీహారికనేం చేయలేకపోయావు. ఆ తరవాత ఆ నైతిక పతనపు ఆత్మగ్లాని నిన్ను వెంటపెట్టుకునే వుంది. ఏ స్త్రీ దగ్గరా నువ్వు సఫలం కాలేకపోయావు. దీనికంతటికీ కారణం నపుంసకత్వం కాదు, నీ నైతిక దృష్టే. నీ భార్య మీద నీకున్న ప్రేమే కారణం. శారీరకంగా నీలో ఏం లోపం లేదు.''అన్నాడు డాక్టర్.

''కానీ డాక్టర్! నేను నీహారికను సాధించాలి..''

నవ్వాడు డాక్టర్. ''నువ్వనుకున్న పద్ధతిలో నువ్వామెని ఏమీ చేయలేవు. ఆమెనే కాదు. ఏ పరస్త్రీనీ ఏమీ చేయలేవు. ఏ ట్రాంక్విలైజర్సో, మందులో ఇచ్చి, నీ నైతిక మానసాన్ని నిద్రపుచ్చి ఒకసారి ఆమెతోడి సాంగత్యాన్ని సఫలం చేస్తాననే అనుకో. ఇహ ఆ తరువాత నీకు పట్టపగ్గాలు ఉండవు. నువ్వు నైతికంగా దిగజారిపోతావు. ఇప్పుడు నువ్వు సాధించినదంతా ధ్వంసం చేసుకుంటావు. గుర్తుంచుకో. నువ్వు ఇప్పుడు పతకోన్ముఖుడవైవున్నావు. నేనేమాత్రం సాయం చేసినా నువ్వింక ఎందుకూ పనికిరావు..''

''కానీ డాక్టర్! ఆమెని నేను సాధించాలి. ఇంతగా నా ఇగోని దెబ్బతీసిన ఆమెని వదలటం నావల్ల కాదు.''

''నీ సమస్యకు రెండు పరిష్కారాలున్నాయి. మొదటిది - నీహారికను వెంటనే ట్రాన్స్‌ఫర్ చెయ్యి. ఇంకో ఆఫీసులో పోస్ట్ చెయ్యి. నువ్వు వేరే పర్సనల్ సెక్రటరీని వేసుకో. నీహారికను కలవకు, ఆమెతో మాట్లాడకు, ట్రీట్ హర్ ఆజ్ యువర్ సబార్డినేట్. రెండోది ఉత్తమమైన పరిష్కారమార్గం - ఆమె నీ ఇగోని దెబ్బతీయలేదు. సాధారణ స్త్రీ ఆమె. నిన్ను కోరింది. నువ్వు ఏం చెయ్యలేకపోయావు. నిన్ను కోరటమా ఆమె తప్పు? నీ అసామర్థ్యాన్ని గూర్చి ఆమె ఇంకెవరి తోనయినా చెప్పిందా, లేదు. ఆమె నొదిలెయ్. నీ ఇగోని దెబ్బతీసింది నీ నైతిక నిష్టేకాని, ఆమె కాదు. ఒంటరి ఆడది. తోడుకోసం వెతుక్కుంది. దారితెలియక అడ్డదారి వెదుక్కుంది. చేతనైతే సరైన దారి చూపించు. ఆమె బాధలు, కష్టాలూ, పరిస్థితులూ ఏవిటో తెల్సుకో. మంచి కుర్రాడెవడైనా దొరికితే ఆమె పెళ్ళి చెయ్యి. అప్పుడామె నీకు మొక్కుతుంది. నువ్వే దేవుడనుకుంటుంది. అలా సాధించు ఆమెను. దట్స్ ద ఓన్లీ వే టు టాకిల్ హర్...''

డాక్టర్ శిశిరచంద్రసేన్ విశ్లేషణతో శ్రీనివాస చక్రవర్తి కళ్ళు తెరిపిళ్ళు పడసాగాయి.

''థ్యాంక్యూ డాక్టర్! నేనీ దృష్టితో ఆలోచించలేదు. ...'' అన్నాడు.

''అసలు మిష్టర్ చక్రవర్తీ! ఈ విషయాన్ని నువ్వు నీ భార్యతో చర్చిస్తే ఆమె తేలిగ్గా నీకు తరుణోపాయం చూపేది. నువ్వు చెప్పిందాన్ని బట్టి ఆమె చాల రేషనల్ బీయింగ్, సేనర్ మెంటాలిటీ వున్న స్త్రీలా అనిపిస్తోంది. బెటర్ టెల్ యువర్ వైఫ్. నిన్ను తప్పుగా అర్థం చేసుకోదు ఆమె. నీ సమస్య చిటికెలో తీర్చిపారేస్తుంది. నీహారిక పట్ల కఠినంగా ప్రవర్తిస్తుందని కూడా నువ్వనుకోవద్దు.....''

''కానీ డాక్టర్!....''

''జయదేవుడు... అదేనయ్యా భక్త జయదేవుడు తన్ను తానేమని పిల్చుకున్నాడో తెల్సునా, 'పద్మావతీ చరణచారణ చక్రవర్తి'నని. నువ్వూ అంతే. మీ దాంపత్యమూ అన్యోన్యమే. నువ్వూ 'పద్మావతీ చరణచారణ చక్రవర్తివే'. అందులో తక్కువతనమేం లేదు. పేరులోనే కాదయ్యా సార్థకంగా నువ్వూ చక్రవర్తివే మీ ప్రేమ సామ్రాజ్యంలో. ఆ పద్మావతీ చరణచారణత్వమే నిన్ను కాపాడింది. కాపాడుతుంది...'' అంటూ నవ్వాడు డాక్టర్ తెల్లగా, తుషారంలా, మల్లికాహారంలా, కుందమందారంలా, సితతామరలా, శరశ్చంద్ర చంద్రికలా.

'ఈనాడు' ఆదివారం

17-5-1992